క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన రవీందర్‌రావు



నర్సంపేట: అమెరికా, కెనడా పర్యటన ముగించుకుని స్వదేశానికి విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైలం, మహానంది దేవాలయాల తీర్థ ప్రసాదాలను అందించారు. కలిసిన వారిలో నర్సంపేట సొసైటీ చైర్మన్ బొబ్బల రమణారెడ్డి, నిరంజన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన కాంగ్రెస్ నేతలు

పర్వతగిరి: తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీగా గెలుపొంది మొదటిసారిగా బుధవారం వరంగల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, కొంకపాక మాజీ ఉపసర్పంచ్ రంగు రంజిత్‌గౌడ్, వీరేశంలు తీన్మార్ మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వనభోజనాలకు వెళ్లిన లక్నెపల్లి వాసులు



నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నెపల్లి గ్రామస్తులు బుధవారం వనభోజనాలకు వెళ్లారు. గ్రామశివారులోని చెట్ల కిందకు వెళ్లి సంవృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు సల్లంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ, కులపెద్దలు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు స్వాగతం



చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం హైస్కూల్‌కు బదిలీపై వచ్చిన హెచ్‌ఎం శ్రీనివాస్‌ను పాఠశాల చైర్‌పర్సన్ మమత రాజు స్వాగతం పలికారు. బుధవారం శాలువాతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలను ప్రైవేట్‌కు దీటుగా నడిపించాలని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుటలో ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, రాజేందర్, సుభాష్, ఆజాం, పంచాయతీ కార్యదర్శి రాజు,నాయకులు ఎల్ల నారాయణరెడ్డి, ఎర్ర రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ఎమ్మెల్యే పూజలు



నర్సంపేట: పట్టణంలోని ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి బోనాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పెద్దమ్మతల్లి బోనాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

మైనర్లు పట్టుబడితే జైలుకే..

హసన్‌పర్తి: మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లయితే కేసులు నమోదు చేసి జైలుకుపంపిస్తామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ శ్రీనివాస్ పుప్పాల హెచ్చరించారు. నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో మంగళవారం ట్రాఫిక్ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి డాక్టర్ శ్రీనివాస్ పుప్పాల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సార్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డాక్టర్ ఎ.వి.వి సుధాకర్, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె. రవీందర్, ట్రాఫిక్ సీఐ శుక్రు,ఎంవీఐ కిశోర్‌బాబు,మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్



నర్సంపేట : ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ మల్లం నవీన్, సిబ్బంది, విద్యార్థులు

నర్సంపేట: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ అన్నారు. కళాశాలలో జాతీయ సేవ పథకం, ఐక్యూఏసీ, మహిళా సాధికారత సెల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మాదకద్రవ్య వినియోగం, అక్రమ రవాణా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, దాని వల్ల వచ్చే నష్టాల గురించి వివరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్ధారించుకొని వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివ నాగ శ్రీను, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.రమేశ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, టి.రమేశ్, ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.విష్ణుకుమార్, ఎం.సమ్మయ్య, డాక్టర్ లకన్‌సింగ్, డాక్టర్ జి.ప్రసూన, డాక్టర్ టి.సుమతి, ఎం.నరేందర్, ఎం.శైలజ పాల్గొన్నారు.

చెన్నారావుపేట: గంజాయి, డ్రగ్స్‌లాంటి వ్యసనాల నుంచి యువతరాన్ని కాపాడాలని వైద్యాధికారి సరోజ పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా యవతరాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ స్వరూపరాణి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రేమలత, సూవార్త, ఫార్మసిస్ట్ లీలారాణి, శివాజీ, వెంకట్‌రెడ్డి, సురేందర్, లింగమూర్తి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం

ఖానాపురం: తెలిసో తెలియకో ఒకసారి మాదకద్రవ్యాల రుచికి మరిగితే యువత భవిష్యత్ అంధకారంలో పడిపోతుందని స్థానిక వైద్యాధికారి జ్యోతి అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా స్థానిక పీహెచ్‌సీలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీనేజ్ పిల్లలు, విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగానికి బానిసై విలవిల్లాడుతన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమంలో పల్లె డాక్టర్ సునీత, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగయ్య, హెల్త్ అసిస్టెంట్లు భాస్కర్, రాంప్రసాద్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు సనీత, ప్రతిభ, భార్గవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లంపల్లిలో ర్యాలీ

దుగ్గొండి: మండలంలోని మల్లంపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రధాన కూడలిలో మానవహారం చేపట్టారు. మంచి ఆరోగ్యం కోసం మాదక ద్రవ్యం వద్దు.. డ్రగ్స్ వద్దు... ఆరోగ్యం ముద్దు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. హెచ్‌ఎం భద్రమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట : ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది



ఖానాపురం : మాట్లాడుతున్న డాక్టర్ జ్యోతి



దుగ్గొండి: మానవహారం చేపడుతున్న విద్యార్థులు

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నర్సంపేట : గ్రామపంచాయతీ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇచ్చి పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అడ్డూరి రాజు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(టీపీయూడబ్ల్యూ) ఐఎఫ్‌టీయూ అనుబంధం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఆర్డీఓ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న వేలాది మల్టీపర్పస్ వర్కర్స్‌కు అతి తక్కువ వేతనాలు నెలకు రూ.9500 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పోటీ పడలేకపోతున్న వారికి చెల్లించే అతి తక్కువ జీతాలు కూడా సరిగా ఇవ్వడం లేదన్నారు. కొన్ని చిన్న గ్రామ పంచాయతీల్లో ఏడాది కాలంగా జీతాలు ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ కాలంలో జీపీ సిబ్బంది శ్రమతో రాష్ట్ర ప్రభుత్వానికి అనేక అవార్డులు, రివార్డులు వచ్చాయని గుర్తు చేశారు. 2021పీఆర్‌సీ నివేదిక ప్రకారం 30 శాతం ఫిట్‌మెంట్ జీపీ సిబ్బందికి వర్తింపచేయలేదని, దాని ప్రకారం జీపీలో అమలు చేయాలని 34 రోజులు సమ్మె చేసినా ఆనాటి ప్రభుత్వం 60 జీఓను అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పీఆర్‌సీ జీఓ 60 ప్రకారం వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జవహర్‌లాల్, పెంతపురి రాజు, మదనాచారి, భద్రాచారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎమ్మార్పీ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నర్సంపేట రూరల్ : ప్రైవేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ డ్రెస్సులు అమ్ముతున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ డివిజన్ సహాయ కార్యదర్శి కొమ్ముక రవి, యూఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా కన్వీనర్ సమ్మెట వర్షన్, ఎంఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు సిద్దు అన్నారు. స్థానిక ఎమ్మార్పీ కార్యాలయంలో సీఆర్పీ భరత్‌కు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖధికారులు స్కూళ్లలో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం అమ్మకూడదని ఉత్తర్వులు జారీ చేసిననా ప్రైవేట్ యాజమాన్యాలు పట్టించుకోకుండా విచ్చలవిడిగా అమ్ముతున్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలన్నారు. నర్సంపేటలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ, అనుమతి లేకుండా నిర్వహిస్తున్నా చర్యలు తీసుకోకుండా విద్యాశాఖాధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పట్టణం కేంద్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజులు దోపిడీని, అరికట్టి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలోనాయకులు రాకేష్, మధు, అనిల్, నరేష్, గోపి, రాజు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధిని సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి

సంగెం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళాశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వయంసమృద్ధిని సాధించాలని ఎంపీపీ కళావతి అన్నారు. బుధవారం బుధవారం శాంతి మండల సమాఖ్యలో మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. అర్హత ఉన్న మహిళలను గుర్తించి వ్యాపార రంగంలో రాణించేలా అవసరమైన నైపుణ్యాలను మెరుగుపరుస్తూ వ్యాపార మెలకువలను నేర్పిస్తూ రాణించేలా ప్రణాళికలు రూపొందించారన్నారు. స్వయం సహాయక బృందం మహిళలకు ఎలాంటి ప్రీమియం లేకుండా రుణ బీమాలో రూ. 2 లక్షలు, ప్రమాద బీమాలో రూ.10 లక్షల వరకు బీమా కవరేజ్ కల్పిస్తుందన్నారు. జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ రకాల మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లు ఏర్పాటు చేసుకునేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. వ్యవసాయంతో పాటుగా అదనపు ఆదాయం కోసం కోళ్ల పెంపకం, పాలఉత్పత్తి పెంచుటకు లబ్ధిదారులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, యూనియన్ బ్యాంకు మేనేజర్ అనిల్, ఏపీఎం కిషన్, మండల సమాఖ్య కార్యదర్శి రాజమణి, కోశాధికారి రేణుక, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి



నర్సంపేట : అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



నెక్కొండ : అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు



గీసుకొండ: కొనాయమాకుల వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నర్సంపేట : పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అమర వీరుల స్తూపం వద్ద బుధవారం సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సమస్యలు పరిష్కరించకుండా రోజురోజుకు పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో విఫలం చెందిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గడ్డం యాకయ్య, జిల్లా కమిటీ సభ్యులు పాలక కవిత, యాకుబ్, సాంబయ్య, నాగరాజు, సతీష్, స్వామి, మమత, శైలజ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ: పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు తక్షణమే తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలతో సామాన్య జనం బతుకులు గగనంగా మారిందని, ప్రభుత్వాలు స్పందించాలని ఆయన కోరారు. ధర్నాలో నాయకులు కనుకుల దేవపాల, యాకయ్య, సింగం వెంకటలక్ష్మి, నీరటి రజిత, వీరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారి కొనాయమాకుల స్టేజీ వద్ద పెట్రోల్, డీజిల్‌తో పాటు నిత్యావస సరుకులు, కూరగాయల ధరలు తగ్గించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా, రాస్తారోకో చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు వెంటనే ధరలను తగ్గించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. సీపీఐ మండల సమితి అధ్యక్షురాలు తోట చంద్రకళ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరగోని శంకరయ్య, మండల సహాయ కార్యదర్శి శ్రీధర్, రైతు సంఘం మండల కార్యదర్శి చుక్క మొగిలి, నాయకులు లత, పద్మ, సుజాత, బిక్షపతి, శోభ, హేమలత, కోమల, శిరీష, అన్నపూర్ణ, స్వరూప పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జన్ను రమేశ్

నర్సంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు విద్యాశాఖమంత్రిని నియమించకపోవడం వల్ల విద్యా సంస్థలను కాపాడడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు రాక గోడలను చూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రెగ్యూలర్ ఎంఈఓలు లేక ప్రభుత్వ విద్యా విధానం వెనుకబడి పోతుందన్నారు. గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మోడల్ స్కూళ్లలో పూర్తిస్థాయి 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కస్తూర్బా హాస్టళ్లలో అదనపు సీట్లు కేటాయించాలన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలను రద్దు చేసి ప్రభుత్వ విద్యావిధానాన్ని పెంపొందించాలని అన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ స్కూళ్లలో కంప్యూటర్ విద్య విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యులు రాకేష్, వంశీ, శివ, శ్యామ్, అజయ్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో రోడ్లకు మరమ్మతు



నర్సంపేట: వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని గుంతలు ఉన్న మట్టి రోడ్లకు పట్టణంలోని 1వ వార్డు కౌన్సిలర్ దేవోజు తిరుమలసదానందం బుధవారం తన సొంత ఖర్చులతో మట్టి పోయించి రోడ్లు మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ గుంటి సంజీవ ఇంటి నుంచి కొల్లాపురం సాంబయ్య, గద్దె కనకయ్య ఇంటి నుంచి టెంకురాల సుధాకర్, గుంటి సురేందర్ ఇంటి నుంచి వాంకుడోతు తిరుపతి, సాధనబోయిన రమేశ్ నుంచి నంది ఉపేందర్, శీరంశెట్టి నగేష్ ఇంటి నుంచి దండుసాయి ఇంటి వరకు సీసీ రోడ్లు టెండర్ అయి ఉన్నాయని తెలిపారు. దసరా లోపు సీసీ రోడ్ల పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. టీఎఫ్ఐటీ కో నిధుల నుంచి ఒకటవ వార్డు కోసం రూ.కోటి 20లక్షలు మునిసిపల్ తీర్మాణం అయి ఉన్నాయన్నారు. త్వరలో మునిసిపల్ అధికారులతో టెండర్ వేయించి పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు.

భూ తగాదాలో ముగ్గురి రిమాండ్

నెక్కొండ: భూమి తగాదాలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని ముదిగొండకు చెందిన ఉప్పలయ్యకు ఇద్దరు భార్యలు ఉండగా మొదటి భార్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మొదటి భార్య మృతి చెందడంతో యాకమ్మను పెళ్లి చేసుకోగా ఆమెకు కుమారుడు ఉన్నాడు. కుటుంబ సభ్యులందరికీ సమాన ఆస్తులు పంచి ఇచ్చాడు. కాగా మిగిలిన 30 గుంటల భూమి విషయంలో కొంత కాలంగా కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రెండో భార్యతో పాటు కుమారుడు అశోక్, కోడలు హేమలత కలిసి ఉప్పలయ్య పొలంలో ఈ నెల 25న సర్వే చేయించి హద్దులు నాటుతున్నారు. విషయం తెలుసుకున్న ఉప్పలయ్య పొలం వద్దకు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న క్రమంలో కోపోద్రిక్తులైన ముగ్గురు అతని కాళ్లకు, నడుముకు, మెడకు తాడుకట్టి కొంత దూరం లాక్కెళ్లారు. తనను చంపడానికే భార్య, కుమారుడు, కోడలు ప్రయత్నం చేశారని అదే రోజు ఉప్పలయ్య ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎస్సై పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు విచారణ చేసి ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఉదయం ముగ్గురిని రిమాండ్‌కు తరలించామన్నారు. భూ తగాదాలు సామరస్యంగా, లేదంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని ఎస్సై సూచించారు. భూ తగాదాల్లో ఎలాంటి గొడవలు జరిగినా వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

యాకూబ్ మృతి పార్టీకి తీరనిలోటు



యాకూబ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీపీ అనిమిరెడ్డి, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్

రాయపర్తి: మండల కో ఆప్షన్ మాజీ సభ్యుడు, మండలంలోని కాట్రపల్లి బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త ఎర్ర యాకూబ్ మృతి పార్టీకి తీరనిలోటని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ అన్నారు. యాకూబ్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఉపాధ్యక్షుడు ఎండీ నయీం, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ అశ్రఫ్‌పాషా, గ్రామశాఖ అధ్యక్షుడు మండల శ్రీధర్, సంకినేని ఎల్లస్వామి, ఎండీ.అంజద్, ఎత్తి సోమన్న, యాకయ్య, అనిల్, బూడిద సోమయ్య తదితరులు ఉన్నారు.

రెవెన్యూ అధికారుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

చెన్నారావుపేట: మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్ మండల గిర్దావర్ వెంకట్‌రెడ్డిపై ఎమ్మెల్యే అనురుద్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెండ్ చేయించినందుకు నిరసనగా స్థానిక రెవెన్యూ సిబ్బంది బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పెండింగ్ ఫైల్స్ పూర్తి చేయడానికి విశ్రాంత నాయబ్ తహసీల్దార్ సహాయంతో ఆదివారం పనిచేస్తుండగా ఎమ్మెల్యే ఆకస్మికంగా కార్యాలయానికి వచ్చి గిర్దావర్‌ను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్, నాన్ గెజిటెడ్ అసోసియేషన్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండోరోజు నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి, గిర్దావర్ చెన్నమల్ల స్వామి, జూనియన్ అసిస్టెంట్ రాజు, శోభ, రికార్డ్ అసిస్టెంట్ శివకోటి, శ్రీను, శీలం రాజు, నర్సింహస్వామి, నర్సయ్య, మొగిళి, నర్సయ్యలు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ అందించడం అభినందనీయం



పాఠశాలలో నోట్‌బుక్స్‌తో విద్యార్థులు

ఖానాపురం: సొంత డబ్బులతో ధర్మారావుపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శోభారాణి ప్రతి ఏటా విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేయడం అభినందనీయమని హెచ్‌ఎం రమాదేవి అన్నారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు శోభారాణి ప్రతి ఏటా రూ.3 వేలతో నోట్‌బుక్స్ కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నట్లు గుర్తు చేశారు. నోట్‌బుక్స్ అందించిన శోభారాణికి విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి చేయాలి



పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ కళావతి

సంగెం: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ కళావతి అన్నారు. బుధవారం మండలంలోని మొండ్రాయి, నార్లవాయి, నల్లబెల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె సందర్శించి పరిశీలించారు. పాఠశాలల పనుల కోసం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి రూ.95 లక్షలు మంజూరు చేయించారన్నారు. పనులు వేగవంతంగా చేయాలని చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని పీఆర్ ఏఈ రమేష్‌కుమార్‌కు సూచించారు. ఆమె వెంట ఎంపీటీసీ సుమలత, ప్రధానోపాధ్యాయులు విజయ, నరసింహస్వామి, నాయకులు మడత కేశవులు, కోడూరి రజిత రమేష్, సుధాకర్ తదితరులు ఉన్నారు.